క్లుప్తంగా

పరశురామావతారంలో జగన్నాథుడు


పరశురామునిగా జగన్నాథుడు

ద్వారకాతిరుమల: పరశురామావతారంలో జగన్నాథుడు బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవారి దత్తత ఆలయమైన లక్ష్మీపురంలోని జగన్నాథ స్వామివారి ఆలయంలో రథోత్సవాల్లో భాగంగా స్వామివారు రోజుకో అవతారంలో దర్శనమిస్తున్నారు. ఈ క్రమంలో ఒక చేత్తో గండ్ర గొడ్డలి, మరో చేత్తో పాత్రను పట్టుకుని ఉన్న పరశురాముని అవతారం భక్తులకు కనువిందు చేసింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అన్నప్రసాద వితరణ

జంగారెడ్డిగూడెం: స్థానిక హై స్కూల్ వద్దగల శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ సన్నిధిలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. సుమారు 1350 మంది అన్నప్రసాదం స్వీకరించినట్టు అన్నప్రసాద వితరణ కమిటీ తెలిపింది. కటారి వాసు, మేడపాటి విద్యాసాగర్‌లు సహకారంతో ఈ వితరణ చేశామని పేర్కొంది. తొలుత వినాయక స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు.

అయ్యప్పకు పూజలు



జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం శ్రీ హరిహర సుత అయ్యప్ప స్వామి దేవస్థానంలో స్వామివారి జన్మన క్షత్రమైన ఉత్తరా నక్షత్రం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించినట్టు ఆలయ కమిటీ తెలిపింది.

9న విజయ దుర్గమ్మకు బోనాలు సమర్పణ

జంగారెడ్డిగూడెం: స్థానిక విజయ దుర్గమ్మవారికి ఈనెల 9వ తేదీ ఉదయం 9 గంటలకు అమ్మవారి గర్భాలయం, ఆలయ ప్రాంగణం అంతా కూడా వివిధ రకాల కూరగాయలతో అలంకరణ చేసి మట్టి పిడతలో ఆవు పాలు, బెల్లం, బియ్యంతో తయారు చేసిన పాయసం బోనాలు సమర్పించనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. తొలుత స్థానిక ఆర్యవైశ్య కన్యకా పరమేశ్వరి ఆలయం నుంచి ముత్యాలమ్మ గుడి మీదుగా విజయ దుర్గమ్మ ఆలయం వరకు 108 బోనాలతో మహిళలు శోభాయాత్ర నిర్వహిస్తారని పేర్కొంది. ఆలయంలో శాకంబరీ ఉత్సవాలు ఏర్పాటు చేశామని తెలిపింది. భక్తులంతా పాల్గొనాలని కోరంది.

గుబ్బల మంగమ్మ సేవలో బాలరాజు దంపతులు


గుబ్బల మంగమ్మను దర్శించుకుంటున్న బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు

బుట్టాయగూడెం: మండలంలోని కామవరం అటవీప్రాంతంలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మ తల్లిని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు బుధవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గంలోని ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ మంచి ఆరోగ్యం, అష్టైశ్వర్యాలతో ఉండేలా దీవించాలని అమ్మవారిని వేడుకున్నట్టు వారు తెలిపారు. వారితో పాటు పలువురు పార్టీ నాయకులు కూడా ఉన్నారు.

విద్యార్థినికి స్కాలర్ షిప్ అందజేత


విద్యార్థినికి స్కాలర్ షిప్ అందిస్తున్న దృశ్యం

చింతలపూడి : గ్రామీణ విద్యార్థులు ఉన్నత చదువులు చదవడానికి ప్రాధాన్యత ఇవ్వాలని భజరంగి భేరి సంఘం అధ్యక్షుడు మూడు శ్రీనివాస్ నాయక్ అన్నారు. ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని బాణావతు కిరణ్మయికి చింతలపూడి మండలం నామవరం తండాలో బంజారా భజరంగి భేరి సంఘం ఆధ్వర్యంలో రూ.2,500 చేతక్ మెరిట్ స్కాలర్ షిప్‌ను బుధవారం అందించి, తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇస్లావత్ ప్రేమ్ చంద్, ఆలోతు హనుమంతు నాయక్, మూడు మహేంద్ర నాయక్, లకావతు ఏసుబాబు నాయక్, బాణావతు మహేష్ రావు నాయక్, బాణావతు సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

మడుగులు కాదు.. రోడ్లే


కొయ్యలగూడెం : బయ్యనగూడెం సరిపల్లి జంక్షన్‌లో రోడ్డు గొయ్యి


కొయ్యలగూడెం : గవర్నమెంట్ హాస్పిటల్ ఎదుట రోడ్డు దుస్థితి


కొయ్యలగూడెం : వంకా బొత్తప్పగూడెం జంక్షన్‌లో భారీ గొయ్యి

- దడ పుట్టిస్తున్న ప్రయాణాలు
- ప్రజల బెంబేలు

కొయ్యలగూడెం: బయ్యనగూడెం – రేగులగుంట మెయిన్ రోడ్డుపై భారీ గోతులు కారణంగా ప్రయాణం ప్రజలకు దడ పుట్టిస్తోంది. కొయ్యలగూడెం మండలం బయ్యన్నగూడెం ప్రధానంగా రింగు రోడ్డు గ్రామాలంటూ పిలవబడే పలు గ్రామ పంచాయతీల పరిధిలోని ఏడు గ్రామాల్లో పరిస్థితి అధ్వానంగా ఉంది. గత ప్రభుత్వంలోని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు రూ.11 కోట్లు బయ్యనగూడెం మొదలుకొని తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం రేగులగుంట గ్రామం వరకు 19 కిలో మీటర్ల మేర రోడ్డు అభివృద్ధి పనులకు కేటాయించారు. కాంట్రాక్టర్ పనులను ప్రారంభించి 20 శాతం పూర్తిచేశారు. ఆసమయంలో ప్రభుత్వం మారడం, కొత్త ప్రజా ప్రతినిధులు భారీగా మామూళ్లు డిమాండ్ చేయడంతో కాంట్రాక్టర్ చేతులెత్తేశారు. ఈనేపథ్యంలో పనులు నిలిచిపోయాయి. నిధులు మృగ్యం అయ్యాయి. గవర్నమెంట్ హాస్పిటల్, ఆరోగ్య ఉప కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ విద్యాలయాలకు చేరుకోవడానికి విద్యార్థులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బయ్యనగూడెం, రేగులగుంట రహదారి అభివృద్ధితో బుట్టాయిగూడెం మండలంతోపాటు గోపాలపురం మండలాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ముఖ్యంగా ఐదు గిరిజన గ్రామాల ప్రాంత ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని దిప్పకాయలపాడు సర్పంచ్ సున్నం శాంత కుమారి తెలిపారు.

30 గ్రామాల ప్రజలకు ఇబ్బందులు



బయ్యనగూడెం – రేగులగుంట గ్రామాల మధ్య గిరిజన గ్రామాలతో సహా 15 గ్రామాలు ఉన్నాయి. వీటితోపాటుగా కొయ్యలగూడెం, బుట్టాయిగూడెం, గోపాలపురం మండలాలకు చెందిన మరో 15 గ్రామాల ప్రజలకు రహదారిపై ప్రయాణం సౌకర్యవంతంగా లేకపోవడంతో 40 కిలో మీటర్ల మేర చుట్టూ తిరిగి తమ గమ్యస్థానాలకు చేరుకోవాల్సి వస్తుంది.

– తాడిగడప ఆంజనేయరాజు, సీపీఐ మండల కన్వీనర్, కొయ్యలగూడెం

ముందుకు రాని కాంట్రాక్టర్లు



ప్రజా ప్రతినిధుల గొంతెమ్మ కోరికలను తీర్చలేక కాంట్రాక్టర్లు పనులు నిర్వహించడానికి వెనుకాడుతున్నారు. ఇప్పటికే మూడుసార్లు రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన పూజలు నిర్వహించిన ప్రజాప్రతినిధులు ఆపై అభివృద్ధి మాట విస్మరించడంతో దీర్ఘకాలిక సమస్యగా కొనసాగుతూ వస్తోంది.

– గంజి ధనకోటిరెడ్డి, రైతు నాయకుడు, వేదాంతపురం

వీడని వాన.. రోడ్లు ధ్వంసం


తహసీల్దార్ కార్యాలయం పక్కన బురదమయంగా ఉన్న అంతర రోడ్డు


బుట్టాయగూడెం : పాత పోస్టాఫీసు రోడ్డుపై బురదనీరు నిలిచి ఉన్న దృశ్యం

బుట్టాయగూడెం: అల్పపీడన ద్రోణి ప్రభావంతో నాలుగు రోజులుగా ఏజెన్సీ ప్రాంతంలో వర్షాలు దంచికొడుతున్నాయి. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షపు నీరు రోడ్లపైనే నిలిచి ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రమైన బుట్టాయగూడెంలో అంతర్గత రోడ్ల అధ్వానంగా మారాయి. తహసీల్దార్ కార్యాలయం పక్కన అంతర్గత రోడ్డు బురదమయంగా మారింది. ఈ రోడ్డుపై నడిచేందుకు కూడా వీలులేకుండా ఉంది. సీహెచ్‌సీ ఎదురుగా ఉన్న పాత పోస్టాఫీసు రోడ్డుపైనా నీరు నిలిచింది. కొమ్ముగూడెంలోని సాయి బాబా గుడి వద్ద కొమ్ముగూడెం వెళ్లే రహదారిపై నీరు నిలిచి అస్తవ్యస్తంగా మారిది. తూర్పు రేగులకుంట గ్రామంలోనూ అంతర్గత రోడ్లపై నీరు చేరింది. రోడ్లపై ఉన్న నీరు బయటకు వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. బుట్టాయగూడెంలో బుధవారం ఉదయం 8.30 గంటల సమయానికి సుమారు 17.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మండలాల వారీగా వేలేరుపాడులో అత్యధికంగా 103.2 మిల్లీ మీటర్లు, కుక్కునూరులో 82.0 మి.మీ. పోలవరంలో 28.4 మి.మీ., కొయ్యలగూడెంలో 25.6 మి.మీ., టి.నర్సాపురంలో 12.2 మి.మీ., జీలుగుమిల్లిలో 9.0 మి.మీ. వర్షం కురిసిందని పేర్కొన్నారు.

రోడ్లపై నిలిచిన వర్షం నీరు


పోలవరం రూరల్ : కొత్తపట్టిసీమ గ్రామం ఓ రహదారిపై నిలిచిన వర్షం నీరు


పోలవరం రూరల్ : కొత్తపట్టిసీమ గ్రామంలో రోడ్లపై నిలిచిన వర్షం నీరు

పోలవరం రూరల్: వర్షాలకు పోలవరం మండలం కొత్తపట్టిసీమ గ్రామంలో వర్షాలకు రోడ్లపై వర్షం నీరు నిలిచింది. దీంతో దోమలు పెరిగి, దుర్వాసన వెదజల్లుతోందని గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. పరిస్థితిని పరిశీలించిన సర్పంచ్ మైగాపుల విజయదుర్గ జేసీబీ మిషన్ ఏర్పాటు చేసి పంచాయతీ కార్యదర్శి విజయకుమారితో కలిసి గ్రామంలో కచ్చా డ్రెయిన్ నిర్మాణ పనులు చేపట్టారు. అయితే కొన్ని ప్రాంతాల్లో డ్రెయిన్ తవ్వకం పనులకు కొందరు అభ్యంతరం తెలిపారు. పూర్తిగా డ్రెయిన్ వ్యవస్థ లేకపోవడంతో వర్షం నీరు నిలిచిపోతోందని, ప్రజలకు ఇబ్బంది లేకుండా నీరు వెళ్లే మార్గం ఏర్పాటు చేసేందుకు సహకరించాలని అన్నారు.

జగన్ పాలన కోసం ఎదురుచూపు


మాజీ ఎంపీ శ్రీధర్‌ను కలిసిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

కామవరపుకోట: రాష్ట్ర ప్రజలు మళ్లీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనే కోరుకుంటున్నారని మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం కామవరపుకోట మండలం కళ్లచెరువు గ్రామంలో ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి నివాస గృహంలో శ్రీధర్ బాబును వైఎస్సార్ సీపీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కార్యదర్శి మిడత రమేష్ బాబు, జెడ్పీటీసీ కడిమి రమేష్, సాయిన కనకరాజు, మేడూరి రంగబాబు, అప్పారావు, మెడంకి చిన్న, ఘంటా భాస్కరావు, తమ్మిశెట్టి సుబ్రహ్మణ్యం, ఆరుమళ్ల ధర్మ, సుబ్బు, మోహ, వేముల సాయి తదితరులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది కూటమి పాలనతో రాష్ట్ర ప్రజలు విసిగించెందారని తెలిపారు.

ఎరువులను దమ్ములో వేసి కలియదున్నాలి


తడికలపూడిలో రైతులకు సూచనలు ఇస్తున్న అధికారులు

కామవరపుకోట: రసాయనిక ఎరువులను దమ్ములో వేసి కలియదున్ని వరి నాట్లు వేయాలని ఏలూరు ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ఫణి కుమార్ తెలిపారు. మండలంలో బుధవారం తడికలపూడి, కేఎస్ రామవరం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి డి.ముత్యాలరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఫణికుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ వరి దుక్కులు, దమ్ముల్లో జీలుగా, జనుము, పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట పైర్లు భూమిలో కలియదున్నుతున్నారని తెలిపారు. ఈ విధంగా చేసిన 10 నుంచి 15 రోజులు ఆగిన తర్వాత వరినాట్లు వేయాలని సూచించారు. దమ్ములో 20 కేజీల జింకు, 20 కేజీల యూరియా, 150 కేజీలు సింగిల్ సూపర్ ఫాస్పేట్, 20 కేజీల పొటాష్ వంటి రసాయనిక ఎరువులను వేసి కలియదున్నాలన్నారు. ఏఓ ముత్యాలరావు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో 5600 ఎకరాల్లో వరి పంట సాగుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆయా రైతు సేవా కేంద్రాల వ్యవసాయ సహాయకులు, ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన


కళాశాలలో వెబ్‌నార్ నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జీఎస్టీ డే సందర్భంగా స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్ వారిచే ఆన్‌లైన్ వెబినార్ బుధవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎన్ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ ఒక దేశం ఒకే పన్ను అనే నినాదాన్ని తీసుకురావడం గొప్ప విషయమన్నారు. జీఎస్టీ అమలులోనికి రావడంతో పరోక్ష పన్నులు అన్నింటినీ లెక్కించడం సులభమైందని తెలిపారు. కామర్స్ అధ్యాపకురాలు సీహెచ్ రమాదేవి, కేవీవీ శిరీష మాట్లాడుతూ జీఎస్టీ రేట్లు, సీజీఎస్టీ, ఎస్‌జీఎస్టి, ఐజీఎస్టీలపై అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాస రావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎం మధు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ


సూర్యనారయాణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

లింగపాలెం: తోచలకరాయుడు పాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కొఠారి సూర్యనారాయణ మృతి వారి కుటుంబానికి, పార్టీకి తీరని లోటని మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. బుధవారం తోచలకరాయుడు పాలెంలో నిర్వహించిన సంతాప సభలో శ్రీధర్, పార్టీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు, దెందులూరు మాజీ ఎమ్మెల్యేకొఠారు అబ్బయ్య చౌదరి, నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేక వెంకట ప్రతాప అప్పారావు, పలువురు నాయకులు సూర్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీరితో పాటు పార్టీ ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జి కారుమూరి సునీల్‌కుమార్ సూర్యనారాయణ కుమారుడు, పార్టీ మండల అధ్యక్షుడు కొఠారి మోహన్‌ను పరామర్శించారు.

ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

వేలేరుపాడు: గోదావరి వరదలు దృష్ట్యా ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు వేలేరుపాడు మండల తహసీల్దార్ కార్యాలయంలోని ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వల్ల వరదలకు మండలం నీటి మునుగుతుందని తెలిపారు. గూడు లేక తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని గుర్తు చేశారు. చీకటిలోనే తలదాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. అనారోగ్యం చేస్తే రవాణా సౌకర్యం లేక మరణం తప్ప వేరే దిక్కే లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా మండలానికి తగినన్ని బోట్లు, తాత్కాలిక పునరావాసాలు, హెల్త్ క్యాంపులు, నిత్యావసర సరుకులు, బరకాలు, కిరోసిన్ లాంటివి ఏర్పాటుచేయాలని కోరారు. రవాణా ఖర్చులు ప్రభుత్వమే ఇవ్వాలని పేర్కొన్నారు. పార్టీ మండల కార్యదర్శి ధర్ముల రమేష్, సీనియర్ నాయకులు మడివి దుర్గారావు, నాయకులు కారం వెంకట్రావు, మడకం ఏసుబాబు, కొత్త వెంకటేశ్వర్లు, కరటం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సాల్వేషన్ ఆర్మీ వ్యవస్థాపక దినోత్సవం

దెందులూరు: ఐదు ఖండాల్లో 134 దేశాల్లో 127 భాషల్లో సాల్వేషన్ ఆర్మీ ఆధ్యాత్మిక సామాజిక విద్య, వైద్య మౌలిక వసతులు కల్పన రంగాల్లో సేవలందిస్తోందని సాల్వేషన్ ఆర్మీ ఏలూరు డివిజనల్ కమాండర్ మేజర్ యేసు రాజ్యం, లత తెలిపారు. బుధవారం ఏలూరు సాల్వేషన్ ఆర్మీ హెడ్ క్వార్టర్స్‌లో 160 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వ్యవస్థాపక దినోత్సవం పతాకాన్ని ఎగురవేశారు. సాల్వేషన్ ఆర్మీ వ్యవస్థాపకులు బూత్ టక్కర్, విలియం బూత్ విగ్రహాల వద్ద నివాళులర్పించారు.

9న సమ్మెను విజయవంతం చేయండి


వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

జంగారెడ్డిగూడెం: నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ ఈ నెల 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను అన్ని సంఘాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ పట్టణ కమిటీ అధ్యక్షుడు పి.సూర్యరావు కోరారు. బుధవారం సీఐటీయూ పట్టణ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మె వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. అంగన్‌వాడీ నాయకులు పి.సూర్యారావు జి.విమల, శిరోమణి, మున్సిపల్ నాయకులు ఆర్ నాగరాజు, బి.బాలరాజు, ఆటో నాయకులు పి.సత్తిబాబు, డి.ఆశీర్వాదం, ఆర్.టి.సి. నుండి జి.ఎస్.నారాయణ, స్థానిక నాయకులు వి.గోపి, ఎన్‌వీరావు, తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి సీపీఐ జిల్లా మహాసభలు

ఏలూరు (టూటౌన్): సీపీఐ ఏలూరు జిల్లా ద్వితీయ మహాసభలు ఈనెల 5, 6, 7 తేదీల్లో చింతలపూడిలో నిర్వహించనున్నట్టు సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య తెలిపారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవన్‌లో బుధవారం నిర్వహించిన ఆయన మాట్లాడారు. 5న నిర్వహించే బహిరంగ సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమల స్థాపన, పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఉద్యమిస్తామన్నారు. నాయకులు బండి వెంకటేశ్వరరావు, ఉప్పులూరి హేమ శంకర్ పాల్గొన్నారు.

వ్యాధులు రాకుండా చర్యలు

కామవరపుకోట: వర్షాకాలంలో వ్యాధులు రాకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ముళ్లగిరి సరళకుమారి ఆదేశించారు. బుధవారం స్థానిక కామవరపుకోట గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సిబ్బందితో పారిశుధ్య నిర్వహణపై సమీక్ష చేశారు. గ్రామంలో దోమల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. చెత్త సేకరణ కోసం కొత్తగా మూడు రిక్షాలు కొనుగులు చేశామని సర్పంచ్ కర్రిపోతు అనూష తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

జంగారెడ్డిగూడెం: బుట్టాయగూడెం మండలం మెట్టగూడెం గ్రామంలో ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు పండ్లు, నోట్ పుస్తకాలు బుధవారం పంపిణీ చేశామని రోటరీ క్లబ్ జంగారెడ్డిగూడెం ప్రెసిడెంట్ పెనుమర్తి సురేష్ బాబు, సెక్రెటరీ పెనుమర్తి సంధ్య ప్రవల్లికలు తెలిపారు. కార్యక్రమంలో టీచర్ సంగీత, అక్కమ్మ, డ్వాక్రా గ్రూప్ లీడర్ పద్మ పాల్గొన్నారని పేర్కొన్నారు.

హామీలను అమలు చేయాలి

టి.నరసాపురం: ఎన్నికల హామీలు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య తెలిపారు. మక్కినవారిగూడెం గ్రామంలో సీపీఐ 9వ మండల మహా సభ కొండముచ్చు శ్రీనివాస రావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. సభలో కృష్ణ చైతన్య మాట్లాడుతూ అర్హులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల నూతన కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేడు ప్రైవేటు పాఠశాలల నిరసన

టి.నరసాపురం: ప్రైవేటు పాఠశాలలపై ప్రభుత్వం తీసుకుంటున్న ఏకపక్ష చర్యలకు నిరసనగా గురువారం అన్ని ప్రైవేటు పాఠశాలలు మూసివేసి నిరసన తెలుపుతున్నట్లు అపుస్మా ఏలూరు జిల్లా జాయింట్ సెక్రటరీ బీఎస్‌సాగర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు ప్రైవేటు పాఠశాలలపై అతిగా స్పందించడం త్రీమేన్ కమిటీలు తనిఖీలు చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జోనల్ సెక్రటరీలు పురం శ్రీనివాస్, కె.పవన్ కుమార్, జి.శ్రీనివాస్, కె.దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి ఎంపీడీఓగా రత్నకుమార్


రత్నకుమార్, ఎంపీడీఓ

చింతలపూడి : చింతలపూడి ఎంపీడీఓగా జేఎం రత్నకుమార్ బుధవారం అధికార బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన మురళీకృష్ణ పదవీ విరమణ చేశారు. సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందేలా కృషి చేస్తానని రత్నకుమార్ తెలిపారు.

మోకాళ్లపై కార్మికుల నిరసన


సమ్మెలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు

జంగారెడ్డిగూడెం: సమస్యలు పరిష్కారం కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్లు చేపట్టిన సమ్మె బుధవారం మూడో రోజు కొనసాగింది. మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ కంతేటి వెంకట్రావు అధ్వర్యంలో కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలను త్వరగా పరిష్కారించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని వెంకట్రావు కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఎలక్ట్రికల్, కంప్యూటర్ ఆపరేటర్లు, యూనియన్ కార్యదర్శి నిమ్మల సుబ్బారావు గౌరవాధ్యక్షులు ఎ.ముత్యాలరావు, కె.అప్పారావు, డి.ముసలయ, ఏఎస్ నూకరాజు, కె.అంజి, టి.శ్రీను, ఎస్‌కే మున్ని, కె.సోమకుమారి, టి.హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల కొరత తీర్చాలి

ఏలూరు (టూటౌన్): కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ తరఫున కలెక్టర్‌కు బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. బదిలీ కౌన్సిలింగ్ సందర్భంగా టీచర్స్ కొరత ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ మండలాల్లో మొత్తం 82 పాఠశాలలు ఉండగా, ఒక పాఠశాలకు ఒక ఉపాధ్యాయుడు మాత్రమే ఉన్నారని తెలిపారు.